
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 మార్చి 2023
5
వైఎస్‌ఆర్



కొత్త బస్సుల కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్
ప్రజాశక్తి - కడప అర్బన్



ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా 2,736 బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇం దులో 1,500 డీజిల్ బస్సులు, 1,000 ఎలక్ట్రానిక్ బస్సులు ఉన్నాయి. 200 బస్సులు డీజిల్ నుంచి ఎలక్ట్రానిక్ బస్సులుగా మార్పు చేయనున్నారు. పట్టణ సర్వీసుల్లో 15 మీటర్ల అంబారీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. అంతర్రాష్ట్ర సర్వీసులపై కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. సీఎం గ్రీన్ సిగ్నల్ పై చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మోటార్లకు మీటర్లు.. రైతులకు ఉరితాళ్లు

- అధికారంలోకి రాగానే టమోటా జాక్‌పాట్ విధానం రద్దు
- అమూల్ పుంగనూరులో ఎందుకుండదు?
- ముస్లిముల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం
- పాదయాత్రలో నారా లోకేష్



వాల్మీకిపురం : రైతుల ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం/కలికిరి

మోటార్లకు మీటర్లు రాయలసీమ రైతులకు ఉరితాడుగా మారబోతోందని, నీరు అందక ఎంతో లోతు బోరు తవ్వాల్సి ఉంటుందని. రైతుకు ఒక బోరు మాత్రమే ఉండాలని ప్రభుతం అనడం సరికాదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 37వ రోజుకు చేరుకుంది. మంగళవారం కలికిరి ఇందిరమ్మనగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలికిరి జెఎన్‌టియు వద్ద, వాయల్పాడు మండలంలోని వాండ్లపల్లి, గంధబోయినపల్లి, బీదవారిపల్లి, చింతపర్తి, బోయపల్లి క్రాస్ వరకూ పాదయాత్ర సాగింది. 10.9 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మైనారిటీలు, రైతులు, ఎస్‌టిలతో ముఖాముఖి, విద్యార్థులతో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టమోటా రైతులకు గిట్టుబాటు ధర లేదన్నారు. రోజుకో విధంగా టమోటా ధర మారుతోందని తెలిపారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు తెస్తానని జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని చెప్పారు. టమోటాలు పోయాల్సింది రోడ్ల మీద కాదని తాడేపల్లిలోని జగన్ ఇంటిముందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు చంద్రబాబు 90 శాతం సబ్సిడీ ఇస్తే ఈ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని, ఎరువుల ధరలు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఒక కోర్టు దొంగన్నారు. మంత్రయ్యాక రైతులను పట్టించుకున్నాడా.? అని ప్రశ్నించారు. జగన్ వచ్చాక పవర్, క్రాప్, ఆక్వా హాలిడే వచ్చిందన్నారు. రైతులకు పార్టీలుండవనీ, రాయలసీమకు టిడిపి హయాంలో రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. తాను 26 రైతు భరోసా కేంద్రాలు చూశాననీ ఎప్పుడు చూసినా తాళాలు వేసి ఉంటున్నాయని తెలిపారు. టమోటా రైతుల దగ్గర నుండి 100 బాక్సుల్లో 20 బాక్సులు జాక్ పాట్ తీస్తున్నారనీ, ఒక్క రైతు భరోసా ఇచ్చి సబ్సిడీలన్నీ రద్దు చేశారని యూరియా తప్ప ఆర్బీకేలో ఏమీ ఉండటం లేదని రైతులు లోకేష్ ఎదుట వాపోయారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో జాక్ పాట్ విధానం రద్దు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. జగన్ అమూల్ తెచ్చారు కానీ అది పుంగనూరులో ఉండదన్నారు.

ముస్లిముల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి టిడిపి చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం ఉదయం నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి ముస్లిం మైనార్టీల సదస్సులో పాల్గొని వారి సమస్యల పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు లోకేష్‌కు వారి సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తగా వాటికి అన్నిటికీ సమాధానం చెప్పారు. తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని, వారికి గౌరవ ప్రదమైన స్థాయిని కల్పించిన ఘనత టిడిపిదేనని ప్రతి ముస్లిం సోదరుడు ఇది గమనించాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయన్ను పలు ప్రశ్నలు అడిగారు. ఉర్దూ మీడియం చదివి చాలా మంది యువత నేడు ఉద్యోగాలు లేక పోస్టులు భర్తీ కాక, పెళ్లిళ్లు కాక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, వక్ఫ్ ఆస్తులకు సంబంధించి జ్యుడీషియల్ పవర్ ఇవ్వాలని ప్రముఖ సాహితీవేత్త వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కోరారు. యువత మాట్లాడుతూ దూదేకుల కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బయట దేశాలకు వెళ్లిన వారికి ఆపద వస్తే ఆదుకోవడానికి సహకారం, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు కొరకు నారా ప్రభుత్వం వస్తే ఏమి న్యాయం చేస్తారో చెప్పాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే ఉర్దూ చదివిన వారికి డిఎస్‌సి పెట్టి పోస్టులు ఇస్తామని, ఇస్లామిక్ బ్యాంకును తప్పకుండా ఏర్పాటు చేస్తామని, విదేశాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొనే వారికోసం గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఎపిఎన్ఆర్‌టిని ఏర్పాటు చేసి దాని ద్వారా వారికి సహాయ సహకారాలు అందజేసేవారిమని, ఇప్పుడున్న ప్రభుత్వం ఆ వ్యవస్థను నాశనం చేసి ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని మేము తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ ఆ బోర్డును క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులకు జ్యుడీషియల్ పవర్ తప్పనిసరిగా తీసుకువస్తామని వారికి హామీ ఇచ్చారు. సదస్సు అనంతరం పాదయాత్ర ప్రారంభించి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా విద్యార్థులతో ముచ్చటించి కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి హనీఫ్, హజరత్ ముస్తఫా, టిడిపి నాయకులు, ముస్లిం మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి - కడప

పట్టభద్రులు , ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు నియమ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుట్టపర్తి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన జెసిలు, డిఆర్ఒలు, నోడల్ అధికారులతో డిఆర్ఒలు, నోడల్ అధికారులతో శాసనమండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అనంతపురం జిల్లా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. కడప కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి డిఆర్వో గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాతో కలసి జెసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలో శాసన మండలి ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు.ఈ నెల మార్చి 10న ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు మరో దఫా శిక్షణ ఇస్తున్నామన్నారు. పోలింగ్ సిబ్బందిని వారి సొంత మండలంలో కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ ఎన్నికల విధులు కేటాయించలేదన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన మెటీరియల్ ప్రోక్యూర్మెంట్ సామగ్రి ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. బ్యాలెట్ పత్రం, బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పివోలు, ఏపీవోలు, ఓపివోలకు శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, నార్మల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాలవద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. బ్యాలెట్ బాకు ్సలకు సంబంధించి గ్రాడ్యుయేట్స్ కు వైట్, ఉపాధ్యాయులకు పింకు కలర్ క్లాత్ బాగ్‌లు కేటాయించామని తెలిపారు. అంతకు ముందు అనంతపురం ఆర్ఒ నాగలక్ష్మి వీసి ద్వారా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాన్ పవర్, ట్రైనింగ్, మెటీరియల్, బ్యాలెట్ పేపర్, ట్రాన్స్‌పోర్టు, మేనేజ్‌మెంట్ బ్యాలెట్ బాక్సుల ప్రొక్యూర్మెంట్ , ఎలెక్టోరల్ రోల్స్, మైక్రో అబ్జర్వర్స్, వెబ్ కాస్టింగ్ తదితర కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాల్లో క్షుణ్ణంగా వివరించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్, డిటిసి మీరా ప్రసాద్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, ఐ అండ్ పీర్ ఏడీ వేణుగోపాల్ రెడ్డి, పోలీస్ అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ

వైసిపికి ఓటు అడిగే అర్హత లేదు

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి రాజీనామా చేసి మాట నిలబెట్టుకోవాలి
ప్రజాసేవకే అంకితమైన పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసిపికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమ ర్శించారు. మంగళవారం కడపలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న నిర్వహించబోయే పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులు ప్రజాసేవకే అంకితమై పనిచేస్తున్న వారిని గెలిపించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగ విద్యావంతులను కోరారు. అధికారంలో ఉన్న పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్నవారి అభ్యర్థులను గెలిపించేందుకు, వారి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు విచ్చలవిడగా అక్రమాలు, అన్యాయాలకు పాల్పడు తున్నారని తెలిపారు. జగన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుస్తున్నారని పేర్కొ న్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరునెలల్లో సిపిఎస్ రద్దుచేస్తానని జగన్ చెప్పారని, ఇప్పుడు మాట తప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. ఒక్కసారి కూడా డిఎస్‌సి పెట్టలేదని, 1998 బ్యాచ్ సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా మభ్యపెట్టి, మైమరపించి మోసం చేస్తున్నారని విమర్శించారు. మాట తప్పం, మడమ తిప్పమని చెప్పి మాట తప్పారని, మడమ తిప్పారని పేర్కొన్నారు. గుంటూరు, కృష్ణా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పోటీ చేసే సమయంలో గెలిస్తే ఆరునెలల్లో యునిఫైడ్ సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరిస్తామని లేదంటే రాజీనామా చేస్తానని 2021, మార్చిలో చెప్పారని, రెండు సంవత్సరాలు గడిచినా ఒక్క సమ స్యను పరిష్కరించలేదని తెలిపారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారు వైసిపి అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తు న్నారని ఎద్దేవ చేశారు. కరోనా కాలంలోనూ 35 మంది టీచర్లు ప్రాణాలు వదిలారని తెలి పారు. వైసిపికి ఓటు ఉద్యోగులకు యోగులకు చేటు అని అన్నారు. రాయలసీ మలో ప్రతాపరెడ్డి, ఉత్తరాంధ్రలో ఆంధ్రా యూనివర్శిటీ విసి నేరుగా రాజకీయ నాయకులతో కూర్చుని వైసిపిని గెలిపంచాల్సిందేనని ఆదేశిస్తున్నారని, వారిపై తీవ్ర చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ వెస్ట్‌లో రూ. 150 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడని వైసిపి, బిజెపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం : ఆర్‌డిఒ

కడప : శాసన మండలి ఎన్నికలలో పోలింగ్ నియమావళి అమలులో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి పి. ధర్మచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సభాసభవనంలో ఎంఎల్‌సి ఎన్నికల విధులు నిర్వహనఖు సంబంధించి 196 మంది సూక్ష్మ పరిశీలకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న నిర్వహించబోయే పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి పోలింగ్ నేపథ్యంలో 38 టీచర్, 93 పట్టభద్రుల ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రాలున్నాయని, పేర్కొన్నారు. ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరుగుతోందా లేదా ఎన్నికల సంఘం నియ మావళిని ఎవరైనా అతిక్రమిస్తున్నారా అన్న అంశాలను నిశితంగా పరిశీ లించాల న్నారు. ఇందుకు ఎన్నికల సాధారణ పరిశీలకుల సూచనలు దృష్టిలో ఉంచు కోవాలని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందా లేదా, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఎన్నికల నియమావళి అమలు, తదిత రాలను సూక్ష్మంగా పరిశీలించాలని సూచించారు. ఎవరైనా నియమావళిని అతి క్రమిస్తే ఉన్నతాధికారుల దృష్టికి, సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకు రావాల న్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో సూక్ష్మ పరిశీలకులు వెలిబుచ్చిన సందేహాలకు ఆర్‌డిఒ తగు పరిష్కారాలను సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న సిబ్బందికి ఓటరు అయినట్లయితే వారికి ప్రత్యేకంగా ఎన్నికల విధులు నుంచి మినహాయింపు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

వైద్య నీతి ప్రమాణాలపై అవగాహన

ప్రజాశక్తి-కడపసిటీ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్, ప్రమాణం చేస్తున్న జూనియర్ వైద్యులు

కడప రిమ్స్ కళాశాలలో జూనియర్ వైద్యులైన హౌస్ సర్జన్లకు 'వైద్యనీతి ప్రమాణాల అవగాహన' కార్యక్రమం మంగళవారం నిర్వ హించారు. కార్యక్ర మాన్ని ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎస్‌వికె ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎస్ఎస్ వెంకటేశ్వర్లు, అడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సందిపోగు లక్ష్మిబాబు నిర్వ హించారు. జూనియర్ వైద్యులు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రవర్తన నియమావళికి ఎప్పటికీ బద్ధుడై ఉంటామని, వైద్య వృత్తి గౌరవాన్ని ఇను మడింపజేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో అనస్తీసియా ప్రొఫెసర్ డాక్టర్ ఎ. సునీల్, ఎస్‌పిఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌రెడ్డి, అధ్యా పక బృందం పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్‌పై రంగోలి పోటీలు

కడప : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో డెటాల్ బనేగా స్వస్త్ ఇండియా వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం హ్యాండ్ వాష్ ఆరోగ్యం అంశాలపై, రంగోలి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులును ఎస్‌బిసిసి జిల్లా కో - ఆర్డినేటర్ కెతుర, డిబిఎస్ఐ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కుమారి, పాఠశాల ప్రిన్సపాల్ జ్యోతిర్మయి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని నిర్మించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో డిబిఎస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, కళాశాల ఉపాధ్యాయినులు రుక్మిణీ, భారతి, రెడ్డెమ్మ , రహమతున్నిషా పాల్గొన్నారు.

ఐక్యూ ఎసి వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ అనుబంధంగా సి.పి.బ్రౌన్ గ్రంథాలయం బాషా పరిశోధన కేంద్రం కళాశాలల అభివృద్ధి మండలి, అంతర్గత నాణ్యత హామీ విభాగం (ఐక్యూ ఏసీ) వెబ్‌సైట్ విశ్వవిద్యాలయ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ , రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య, ఆచార్యులు కె. కృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. వైవీయూ ఐటీ హబ్ సంచాలకులు ఆచార్య ఎంవి శంకర్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కళాశాలల అభివృద్ధి మండలి, అంతర్గత నాణ్యత హామీ విభాగం (ఐక్యూ ఏసీ) సమాచారం వీక్షకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో సి.పి.బ్రౌన్ గురించి, సి.పి.బ్రౌన్ గ్రంథాలయ ఆవిర్భావ- వికాసాలు, పుస్తకాలు, రాయలసీమ అధ్యయన విభాగం సమగ్ర సమాచారం, ప్రముఖుల చిత్రాల, పుస్తకాల క్యాటలాగులు అన్ని వివరాలు వెబ్సైట్లో లభిస్తాయని తెలిపారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - కడప

మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళ చట్టాలపె అవగాహన సదస్సు నిర్వ హించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **కుటుంబంలో మహిళ వెన్నెముక లాంటిది** మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్య కోర్సులను అభ్య సించి ఆర్థికంగా ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి అన్నారు. మంగళవారం ఎంద్రా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనం తరం బ్యూటీ పార్లర్ నందు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ నారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **మహిళలను గౌరవించడం సంప్రదాయం అని** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్. డాక్టర్ మల్లెం. విజయ భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎంఎం ఆస్పత్రిలో కంటి వైద్యశాలలో నర్సులుగా సేవలందిస్తున్న అయ్యవారమ్మ, సుధాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ ఎస్.ఎం ఆసిఫ్ రాయల్ కరీముల్లా సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరిముల్లా, సౌమ్య, ఆయేషా, ప్రియా, విద్య, సునీత పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** మహిళలు అన్నిరంగాలలో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ ప్రకాష్ రావు పేర్కన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎం వి సులోచన ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ ప్రముఖ మహిళా గైనకాలజిస్ట్ డాక్టర్ మృధుల విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్ర మంలో ఈశ్వరయ్య రంగ సముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, డాక్టర్ మర్కారెడ్డి, అధ్యాపకులు సబితా, గురమ్మ, జి.సి.పీరయ్య, ఎస్ మల్లికార్జున, ఎస్.మధు, జి.నరసింహారెడ్డి కళాశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చదువే సమాజ పురోగతికి కొలమానం

పెండ్లిమర్రి : అమ్మాయిల చదువే సమాజ పురోగతికి ప్రామాణికమని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కస్తూరిబా పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థానం చదువే నిర్ణయిస్తుందని తెలిపారు. ఒక నిర్దేశిత లక్ష్యం కోసం సాధన ముఖ్యమన్నారు. విద్యార్థులు సమాజం, పేదరికం గురించి తెలుసు కోవాలన్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. మనస్సు పెట్టి చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఎంఇఒ అల్తాఫ్ హుసేన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ తోటి చదివినప్పుడే గొప్ప స్థానాలు చేరుకుంటారని చెప్పారు. ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యంతో చదవాలని పేర్కొ న్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బహుమతులు ద్వారా అభినం దించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ సరస్వతి, సిబ్బంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకులకు డాక్టరేట్



కడప : నగరంలోని ఎస్.కె.ఆర్ అండ్ ఎస్.కె.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు కాకి వెంకటసుబ్బయ్యకు విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ అందు కున్నారు. ఈయన నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ కె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడప జిల్లాలోని 'మహిళల సాధికారతలో స్వయం సహాయక బృందాలు, బ్యాంకు లింకేజీల పాత్ర' అనే అంశంపై తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. వెంకటసుబ్బయ్యను ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (జిసిటిఎ) జిల్లా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి పి. రామకృష్ణ, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు హరిప్రసాద్, కుటుంబ సభ్యులు పలువురు అధ్యాపకులు అభినందించారు.

చేతిరాతపై మెలకువలు

పోరుమామిళ్ల : పట్టణంలోని ఎస్టీ కాలనీ గిరిజన గురుకుల పాఠశాలలో చేతిరాత పై విద్యార్థులకు చేతిరాత నిపుణుడు మల్లేశ్వర రెడ్డి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సంద్భంగా అయన మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులకు మంచి మార్కులు సాధించేందుకు మెలకువలు నేర్పుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పవన్ కుమార్, వార్డెన్ శ్రీనివాసరావు, పాఠశాల పిఇటి అనిల్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఇఒగా ఎద్దుల రాఘవరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్



జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎద్దుల రాఘవరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి డిఇఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న చెప్పలి దేవరాజ్ స్థానంలో రెగ్యులర్ డిఇఒను నియమిస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. నేడు,రేపో రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు.



క్రీడల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

నేడు మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బుధవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జీవన్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీవో హోంలో సాయంత్రం 6 గంటలకు బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డి కోటేశ్వరమ్మ, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఇ శారద హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, కోశాధికారి నిత్య, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, నాగార్జున, మహిళా విభాగం చైర్మన్ శాంతమ్మ, కన్వీనర్ భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల జ్యోతి, సిటీ చైర్మన్ గౌరీ, కన్వీనర్ జోతి, పద్మజ, లలిత,పద్మావతి పాల్గొన్నారు. అనంతరం జియోన్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ తిరుమల రావ్ పి. డి ఆధ్వర్యంలో జియాన్ కళాశాల మైదానంలో ఎహిళా ఉద్యో గులకు జవాలిన్ స్టిక్,డిస్క్ త్రో, లెమన్ స్పూన్, త్రోబాల్ రనింగ్ ఆటల పోటీలు నిర్వహించారు.

డాక్టర్ వైఎస్‌ఆర్ ఎఎఫ్‌యూ ఫలితాలు విడుదల

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, స్కల్చర్, ఫొటోగ్రఫి, ఆర్ట్ హిస్టరీ, పెయింటింగ్, ఇంటీరియర్ డిజైన్) విభాగాలకు సంబంధించిన (ఆర్21)మూడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ విడుదల చేశారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను స్క్రీన్ పై విడుదల చేశారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ 78 శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, సూపరిం టెండెంట్ వై. పవన్ కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారులు ఉదయ ప్రకాష్ రెడ్డి, లక్ష్మి ప్రవళిక పాల్గొన్నారు.

అరుదైన పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్ : దువ్వూరు మండలం చల్లబసాయపల్లె గ్రామానికి చెందిన ఎస్.ఆర్.ప్రతాపరెడ్డి తన గ్రంథాలయంలోని 2,488 అరుదైన పుస్తకాలను మంగళవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి అంద జేశారు. పుస్తకాలను బహూకరించిన .ప్రతాపరెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉపకులపతి ఆచార్య జి.రంగ జనార్దన, కులసచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు.

ఆక్రమణదారులకు నోటీసులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ఒంటిమిట్ట (సిద్ధవటం) : మండలంలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 936/ఎ లోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌ను నిర్మించిన ఐదుగురు వస్త్ర దుకాణ దారులకు తహశీల్దార్ శంకరావు మంగళవారం నోటీసులు జారీ చేశారు. తమ వద్ద ఉన్న నోటీసులతో తహశీల్దార్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించారు. ఈనెల 4న ప్రజాశక్తి పత్రికల్లో ' రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన తహశీల్దార్ ఆక్రమణ దారులకు నోటీసులు పంపారు. సిద్దవటం ఉప్పరపల్లిలోని 936/ఎ సర్వే నంబర్‌లో ఒక్కొక్కరు పది చొప్పును దాదాపు 50 సెంట్లు ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణదారులు సంబంధిత ఆధారాలతో హాజరు కావాలని తహశీల్దార్ పేర్కొన్నారు.

వైసిపి పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌ఛార్జిగా చీర్ల సురేష్

చెన్నూరు : వైసిపి పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌ఛార్జిగా చీర్ల సురేష్‌యాదవ్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు, కడప తిరుపతి పంచాయతీ రాజ్ విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా వైసిపి కేంద్ర కార్యాలయంలో ప్రకటన ఇచ్చిందని తెలిపారు. తనను నమ్మి బాధ్యత అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. తన నియామకానికి కారకులైన ముఖ్యమంత్రికి, ఎంపీ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎంఎల్ఎ రవీంద్రనాధరెడ్డికి, డిప్యూటీ సిఎం అంజాద్‌బాషకు, జిల్లా అధ్యక్షులు కె. సురేషబాబుకు, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆధార్ కార్డు డేటాను అప్‌డేట్ చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో 2010 నుంచి 2018 మధ్య తర్వాత ఆధార్ కార్డు పొందిన వారు పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని డిఆర్ఒ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న వారి ఆధార్ నమోదు, నవీకరణ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుట్టిన పిల్లలకు ఆధార్ పొందేలా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియ పూర్తికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని చెప్పారు. విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశిం చారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి, జిల్లాపరిషత్ సిఇఒ సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేయిస్తున్న డాక్టర్ శ్రీనివాస

గాలికుంటు వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి వాన శ్రీనివాస తెలిపారు. మండలంలోని చింతకుంట గ్రామంలో పశువైద్యాధికారి శ్రీనివాస ఆధ్వర్యంలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకా వేయించడం వల్ల వాటిల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయని సూచించారు. గాలికుంటు వ్యాధి దరి చేరకుండా టీకాలు వేయించాలన్నారు. గ్రామంలో 12 ఆవులు, 63 గేదెలు, 46 దూడలకు టీకాలు వేశామన్నారు. 10 ఎద్దులు, 46 గేదెకు చెవి కమ్మలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగనాయకులు, గోపాల మిత్రలు శివలింగేశ్వరరెడ్డి, పార్థసారధి, సిబ్బంది మేరీ, వీరేంద్ర, నాగయ్య పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

జెఎన్‌టియు అనంతపురం వారు ఇటీవల విడుదల చేసిన ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో ఇసిఇ విభాగానికి చెందిన ఎన్.సుష్మ 90.89శాతం, యు.వెంకటసుబ్బమ్మ 90.89, డి.గురుభారతి 89.11, సిఎస్ఇ విభాగానికి చెందిన జి.భవ్యశ్రీ 86.11, కె.మోహనశ్రీ 86.11, జి.అలీ సాలెలెహ్ 86శాతం, ఇఇఇ విభాగానికి చెందిన యు.గంగాజ్యోతి 85.89, బి.శ్రేయ 85.56, పి.గంగాసుధా 85, మెకానికల్ విభాగానికి చెందిన ఎం.ధరణీధరన్ రెడ్డి 83.22, కె.గంగా సురేంద్రరెడ్డి 82.89, ఎం.సలీం బాగ్ 80.78, సివిల్ విభాగానికి చెందిన ఎం.ధవనీశ్వరరెడ్డి 84.56, సి.సూర్యనారాయణ 81.89శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు స్త్రీశక్తి భవన్‌లో వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులోని స్త్రీ శక్తిభవన్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఇందిరా క్రాంతి పథకం వెంకటరమణ తెలిపారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, వివిధ రంగాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళలు హాజరుకావాలని కోరారు.

అధికారంలోకొస్తే మీటర్లు తొలగిస్తాం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ పంపుసెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న మీటర్లను తొలగిస్తామని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 మార్చి 31లోపు రాష్ట్రంలో ఉన్న 18.50 లక్షల వ్యవసాయ మోటర్లకు రూ.6,500 కోట్లు ఖర్చు చేసి స్మార్ట్ మీటర్లు బిగించాలని వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఇది వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్ర అన్నారు. చంద్రబాబు, టిడిపి నాయకులు ఉచిత విద్యుత్తును వ్యతిరేకించినట్లు చెప్పారు. వ్యవసాయానికి ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో తెలుసుకోవాలంటే ఫీడర్ వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మీటర్లు బిగించవచ్చు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మెప్మా పిడి రామ్మోహన్‌రెడి, మున్సిపల్ కమిషన్ నరసింహారెడ్డి సూచించారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఆర్‌పిలు, డ్వాక్రా మహిళలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మెప్మా సిఒలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో హోలీ వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం హోలీ, ముందస్తు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన సంబరాలు అందరిని అలరించాయి. ముఖ్యఅతిథిగా సిబిఐటి ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితం రంగులమయం కావాలని ఆకాంక్షించారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో ప్రముఖ పాత్ర వహిస్తూ పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. పాఠశాల చైర్మన్ వి.లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కో రంగుకు ఒక్కో గుర్తింపు ఉందన్నారు. మనిషి ఇష్టపడిన రంగును బట్టి వారి ప్రవర్తన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హోలీ వేడుకల్లో చిన్నారులు

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

నంది మండలం గ్రామ సమీపంలోని మామిడి తోటలో గుర్తుతెలియని కాలిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. చనిపోయిన వ్యక్తి దాదాపు 50 ఏళ్లు ఉంటుందన్నారు. కాలిన గాయాలు, చుట్టుపక్కల ఉన్న ఆనవాళ్లను బట్టి సోమవారం రాత్రి అతను మృతి చెందినట్లు తెలిపారు. అడవి పందుల నుండి రక్షణ కొరకు వేసుకున్న కరెంటు ఫెన్సింగ్ తీగలు తగిలి ఉండవచ్చని తెలిపారు. వివరాలకు పెండ్లిమర్రి ఎస్‌ఐ 91211 00527, కడప రూరల్ సిఐ 91211 00525 సెల్ నెంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఘర్షణ కేసులో జైలు శిక్ష, జరిమానా

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో 2017లో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి జమ్మలమడుగు కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాళ్లప్రొద్దుటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని బి.కొత్తపల్లి గ్రామంలో పొలం వివాదంలో రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగింది. దీనిపై తాళ్లప్రొద్దుటూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్థలం విషయంలో గొడవ పడిన కేసులో సిద్దయ్య అబ్బయ్యకు 3 నెలలు జైలుశిక్ష, రూ.5000 జరిమానా విధించారు. సిద్దయ్య రామాంజనేయులుకు కూడా 3 నెలలు జైలుశిక్ష, రూ.5000 జరిమానా విధించారు. సిద్దయ్య పార్వతి, సిద్దయ్య సుబ్బరత్న, మైల కృష్ణయ్యకు, మైల జయన్నకు ఒక్కొక్కరికి రూ.5000 జరిమానా వేసినట్లు తాళ్లప్రొద్దుటూరు పోలీసులు తెలిపారు.

చెత్త దిబ్బలు.. వాహనదారులకు తిప్పలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరు వైపులా చెత్త దిబ్బల ఉండడం వల్ల ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. వాహనాల రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు గ్రామానికి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున చెత్త దిబ్బలున్నాయి. ఈ మార్గం నిత్యం ఎల్లవేళలా వాహనాలతో రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకల సమయంలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. చెత్త దిబ్బలు రోడ్డుపైకి వచ్చి చేరి రాకపోకలకు సమస్యగా మారింది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాహదారులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఖాజీపేట నుంచి కమలాపురం వెళ్లే మార్గంలో సుంకేసుల దళితవాడ వద్ద చెత్త దిబ్బలు అధికంగా ఉన్నాయి. ఈ మార్గం కూడా నిత్యం రద్దీగా ఉంటుంది. ఖాజీపేట మీదుగా కమలాపురం, ఎర్రగుంట్లకు వెళ్లే వాహనాలు అధికంగా ఉన్నాయి. రహదారులు వెంబడి చెత్త దిబ్బలు ఉండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడంతోపాటు రాకపోకులకు సమస్యగా మారింది. వీటిని వెంటనే వాటిని తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఆంజనేయకొట్టలు గ్రామం వద్ద ప్రధాన రాదారిపై ఉన్న చెత్త దిబ్బలు

ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ఉండాలి

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు/బద్వేలు


వి.రామలక్ష్మిదేవి

సమస్యలను ఎదుర్కొని, వాటిని పరిష్కరించి నిల దొక్కుకోవడానికి ప్రతి మహిళా ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని సంయుక్త సబ్-రిజిస్ట్రార్-1 వి.రామలక్ష్మిదేవి తెలి పారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని మంగళవారం ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. మహిళ నిర్భయంగా జీవించగలిగే రోజు నిజమైన మహిళా దినోత్సవం అన్నారు. చదువే మహిళకు రక్ష. ప్రతి మహిళ ఉన్నత స్థితికెళ్లేందుకు ఉన్నత చదువులు చదవాలన్నారు. అబ్బాయి అయినా.. అమ్మాయి అయినా ఒకే దృష్టితో చూడాలన్నారు. వివక్షకు గురి అవుతున్నామనే భావన అమ్మాయిల్లో కలుగకూడదన్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని, సమాజం వీరి పట్ల గౌరవభావం కలిగి ఉండాలన్నారు. భర్త సంపాదన ఎక్కువైనా, తక్కువైనా సంసారాన్ని ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చక్కగా నడపగలిగేది భార్యగా మహిళే అని తెలిపారు. భూదేవి అంత సహనాన్ని కలిగి ఉండి చాకచక్యంగా వ్యవహరించి బిడ్డల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దగలిగేది మహిళ అన్నారు. ఇలాంటి గొప్ప లక్షణాలు కలిగిన మహిళను చేతులెత్తి మొక్కిన రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నిజమైన అర్థం దక్కుతుందని రామలక్ష్మిదేవి అన్నారు.

చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

గతంతో పోలిస్తే మహిళల్లో అక్షరాశ్యతా శాతం పెరుగుతోంది. అదే సమ యంలో మహిళల పట్ల అఘాయిత్యాలు కూడా పెరుగుతున్నాయి. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను కఠినంగా అమలుచేసిన రోజు మహిళలకు భయంలేని సమాజాన్ని నిర్మిం చవచ్చని మానసిక, స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ ఎస్.కవితాప్రసన్న అన్నారు. ఇంట్లోనూ, వృత్తిలోనూ మహిళ రాణిస్తోందన్నారు. బాలబాలికలను ఇంట్లో ఒకే రకంగా చూడా లన్నారు. తమ సమస్యల్ని సొంతగా పరిష్కరించుకునే నైపుణ్యం పెరగాలని, ఇందుకు మొదటి మెట్టు తమ గృహం కావలన్నారు. ఇంట్లో అమ్మానాన్నలు సఖ్యతగా ఉంటూ పరస్పరం గౌరవించుకుంటే ఆ ప్రభావం బిడ్డలపై పడుతుందన్నారు. ఆ బిడ్డల పెంపకం సమాజంపై పడుతుందన్నారు. ఇందులో తల్లి ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మ (మహిళ)ను సృష్టించాడంటారు.. ఎక్కడ మహిళ గౌరవించబడుతుందో అక్కడ సుఖసౌఖ్యాలు అలరారు తాయన్నారు. అన్నిటా నీవే.. సమస్తం నీవే.. అందుకే ఓ మహిళా(మాతృ)మూర్తి అందుకో మీకివే మా వందనం అని డాక్టర్ కవితాప్రసన్న చెప్పారు.


డాక్టర్ కవితాప్రసన్న

అన్ని రంగాల్లో ముందుండాలి

మహిళలు సాధికారత సాధించే దిశగా పయనించాలని, అన్ని రంగాలలో ముందుండాలని షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వై.సరస్వతి ఆకాంక్షించారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ ఒక మహిళ విద్యావంతురాలు అయితే తనతో పాటు తన కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలన్నారు.


డాక్టర్ వై.సరస్వతి

సకాలంలో విధులకు హాజరవ్వాలి


సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సిబ్బంది సరైన వైద్యం అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకాల స్టాక్ ఐఎల్‌ఆర్ టెంపరేచర్ మెయింటేనేషన్ రికార్డులను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు చెందిన కుష్ఠు, క్షయ నివారణ, హెచ్ఐవి వ్యాధులకు చెందిన వివరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సకాలంలో విధులకు హజరు కావాలన్నారు. రోగులను ప్రేమతో పలకరించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వద్దని సూచించారు. గ్రామాల్లోకి వెళ్లి ఆయా ప్రాంతాల్లో ప్రబలే వ్యాధుల సమాచారం తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నిషా బేగం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఫార్మసీ రేణుకదేవి, స్టాఫ్‌నర్స్ హెలెన్, రిజ్వానాభాను, లాబ్ టెక్నీషియన్ హరి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి తెలిపారు. కుష్ఠు వ్యాధిపై ఇంటింటా సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికెళ్లి వ్యాధి గ్రస్తులను గుర్తించి, వివరాలను రికార్డులో పొందుపరచాలన్నారు. భాకరాపురం, రోటరీపురం, నగరగుట్ట ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో నల్లపురెడ్డిపల్లి, పులివెందుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి వర్షపు నీటి బొట్టును కాపాడుకోవాలని, అప్పుడే భవిష్యత్ తరాలకు నీటిని అందించగలమని నెహ్రూ యువ కేంద్ర, జిల్లా అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో మంగళవారం నేషనల్ వాటర్ మిషన్ మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్ర అధ్వర్యంలో క్యాచ్ ది రైన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా మణికంఠ మాట్లాడుతు రాబోయే రోజులో వచ్చే ప్రతి వర్షపు నీటి బిందువును ఒడిసి పట్టుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమారి మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేసి, అనేక పద్ధతుల ద్వారా భూగర్భ నీటిని పెంచే అవకాశాలున్నాయని తెలిపారు. క్యాచ్ ది రెయిన్ అనే కార్యక్రమం ద్వారా యువతకు తమ బాధ్యతను గుర్తు చేశారన్నారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతు ప్రయత్నంగా వర్షపు నీటిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర సేవ అరుణ్‌బాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి


తూకాలను పరిశీలిస్తున్న గంగాధర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రభుత్వ అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీని సక్రమంగా చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. బ్రాహ్మణపల్లిలో మంగళవారం చేపట్టిన రేషన్ పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు లేకుండా పంపిణీ చేయాలన్నారు. రేషన్ తీసుకుంటున్న వారితో మాట్లాడుతూ రేషన్ పంపణీపై ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. వేలిముద్రలు పడనివారు సంబంధిత వాలంటీర్‌ను పిలిపించుకొని వేలిముద్ర వేయించి బియ్యం తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, వైసిపి నాయకులు కోళ్ల భాస్కర్, రాజేష్ నాయుడు, చలపతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే లైసెన్స్ మంజూరు

ప్రజాశక్తి - వేంపల్లె


దరఖాస్తు చేసుకున్న వారితో ఎంవిఐ ప్రసాద్

ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేకదృష్టి పెట్టి, డ్రైవింగ్ నేర్చుకున్న యువకులు సులువుగా లైసెన్స్ పొందవచ్చని పులివెందుల ఎంవిఐ ప్రసాద్ తెలిపారు. అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ నేర్చుకుంటున్న యువకులకు మంగళవారం ఎంవిఐ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ కోసం దరఖాస్తులు చేశారు. ఎల్ఎల్ఆర్ తాత్కాలికమన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అనుసరిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. చైతన్య మహిళా మండలి సభ్యు డు మైఖేల్, బిఎన్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర పాల్గొ న్నారు.

మూడు చక్రాల సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పుట్టుకతో నడవలేక ఇంటికే పరిమితమైన విభిన్న ప్రతిభావంతుడు జనార్ధన్‌కు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్ మంగళ వారం మూడు చక్రాల సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరు పేదలకు, అనాథ లకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని జనార్థన్‌కు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు ముత్తుముల రామతులసి, సంస్థ ప్రతినిధి టి.వెంకటసురేష్ పాల్గొన్నారు.


మూడు చక్రాల సైకిల్‌ను అందజేసిన ఎఎస్‌పి ప్రేరణ్‌కుమార్

నేడు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్ నగరంలోని మారుతి నగర్‌లో ఉన్న విద్యాసాగర్ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. అవసరమైన వారికి అత్యాధునిక డిజిటల్ ఎక్స్ రే మిషన్ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. మోకాళ్ళ నొప్పులు ఉన్నవారికి సరైన సలహాలిస్తామన్నారు. మెడికల్ క్యాంపుకు వచ్చేవారు తమ పాత రిపోర్ట్స్ తీసుకుని రావాలని పేర్కొ న్నారు. 60 సంవత్సరాలు పైబడిన మహిళలకు, మోకాలు మార్పిడి అవసరం ఉన్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పేరు నమోదు చేసుకున్న వారికి ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.


పంట నమోదు జాబితా ప్రదర్శిస్తున్న ఎఒ కృష్ణారెడ్డి

పంట నమోదు తుది జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని శెట్టివారిపల్లె గ్రామం రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేసిన రైతుల తుది జాబితాను మంగళవారం ఉప సర్పంచు అధ్యక్షతన వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు రబీలో సాగు చేసిన ప్రతి పంటను పరిశీలించి వ్యవసాయ, రెవెన్యూ శాఖ అనుసంధానంతో పంట నమోదు చేసి ఇకెవైసి చేయించామన్నారు. 266 మంది రైతులకు గానూ 725 ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. వీరంతా పంట నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కువగా జొన్న, శనగ, సోయా చిక్కుడు, వేరుశనగ, కొర్ర, మినుము, మొక్కజొన్న, ధనియాలు సాగు చేసినట్లు ఎఒ తెలిపారు. జాబితాలో ఏవైనా తప్పులుంటే సవరణలు చేసుకోవాలని ఎఒ సూచించారు. కార్యక్రమంలో విఆర్ఎ రంగ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణం వేగవంతం చేయాలి

- ఎఐఎఫ్‌బి జిల్లా ఉపాధ్యక్షులు ఓబయ్య

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠంలో బస్టాండ్ నిర్మాణం వేగవంతగా జరగాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) జిల్లా ఉపాధ్యక్షులు ఓబయ్య డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం నిత్యం వేలాది మందితో రద్దీగా ఉంటుందన్నారు. వీరికి బస్టాండ్‌లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి.. ఉన్న బస్టాండ్‌ను కూల్చేశారన్నారు. మళ్లీ బస్టాండ్ నిర్మాణం చేపట్టడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో మఠం వచ్చే భక్తులు ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. బస్టాండుకు స్థలం కేటాయించి, దాని నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎఐఎఫ్‌బి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.


వితరణ చేస్తున్న సంఘం సభ్యులు

పిహెచ్‌సికి వాటర్ కూలర్, కుర్చీలు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఒసి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘ సభ్యులు మనోహర్‌రెడ్డి, సాంబశివారెడ్డి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాటర్ కూలర్, కుర్చీలు, సెలైన్ స్టాండ్లు వితరణ చేశారు. వాటిని వైద్యాధికారి కరిష్మాకు అందజేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చే రోగులు కూర్చునేందుకు కుర్చీలు, సెలైన్ స్టాండ్లు ఎంతో ఉపయోగకరమన్నారు. వేసవిలో రోగులకు చల్లని తాగునీరు అందించేందుకు వాటర్ కూలర్ వితరణ చేయడం హర్షణీయమన్నారు. వస్తువులు వితరణ చేసిన సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుధాకర్, రామ్మోహన్, సూపర్‌వైజర్ శోభాకుమారి, స్టాఫ్ నర్స్ రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మాసిస్టు జగదీష్ పాల్గొన్నారు.


చీనీ చెట్లను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

తక్కువ మోతాదులో నీటి తడులు వేయాలి

ప్రజాశక్తి - లింగాల

చీని చెట్లకు తక్కువ మోతాదులో నీటి తడులు వేయాలని తిరుపతి కెవికె శాస్త్రవేత్తలు గోవింద్, రాజా, నాగరాజు, శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని చీని చెట్లను మంగళవారం వారు పరిశీలించారు. చీని చెట్లు అర్ధంతరంగా ఎండిపోతున్నాయని రైతులకు తెలిపారు. రసాయన ఎరువులు తగ్గించి, తడి,పొడి ఎరువులు వాడాలన్నారు. దీనివల్ల చెట్ల కింది భాగంలో ఉన్న వేర్లు పాతుకుపోయి చెట్టుకు బలం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి రాఘవేంద్రరెడ్డి, మండల వ్యవసాయ సలహా చైర్మన్ రమేష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలో శ్మశాన వాటిక భూమి

- సర్పంచు, గ్రామస్తులు ఆరోపణ

ప్రజాశక్తి - ముద్దనూరు

సమాధులు ఉన్న శ్మశాన వాటిక భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకుని ఆక్రమించుకున్నారని ఆరవేటిపల్లె సర్పంచు పెద్దక్క, గ్రామస్తులు ఆరోపించారు. ఆ మేరకు వారు మాట్లాడుతూ శ్మశానంలో పెరిగిన కంపచెట్లను జెసిబితో తొలగిస్తుండగా భూమి తనదంటూ ఒక వ్యక్తి అడ్డుపడినట్లు తెలిపారు. అంతేకాక ప్రజలకు తాగునీరు అందించేందుకు ఊర కుంట వద్ద ఉన్న బంజరు భూమిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకున్న స్థలాన్ని ఆక్రమించారన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా స్థలాన్ని ఆక్రమించుకుని బేస్ మట్టాలు వేసినట్లు చెప్పారు. భూమి ఆక్రమణపై సోమవారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆక్రమణపై రెవెన్యూ అధికారులు విచారించి న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై తహశీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్మశాన భూమిని ఆక్రమించారని సర్పంచు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు విచారించి, ఆక్రమించుకున్న వ్యక్తికి నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.